
# కోటకట్టడం ఎలా?



## అవసరాల రామకృష్ణారావు

మనకి తెలియకపోతే తెలిసినవాళ్లని చూసి నేర్చుకోవాలి. సూటిగా చూడడం గాని, ధైర్యంగా ఆలోచించడం గాని, నిండుగా నిజం చెప్పడంగాని మరచిపోయి, 'రోజుకో దేవరా, వీధికో జాతరా' విషయంలో మాత్రమే ఆసక్తి అభివృద్ధి చూపించే, సాధించే, 'సర్వతోముఖ వ్యభిచార సంస్కృతి'లో బతుకుతున్న జనంలో ఎవరికి వారుగా నిలబడాలన్నా కొన్ని స్వయం ఉపాధి పథకాలు తప్పవంటుంది పంకజం. ఆరోగ్యమూ వయసూ ఉన్న ఆడదానికి ఒంపులూ సొంపులూ ఒకరు యిచ్చేదేమిటి, అవే వస్తాయి. వన్నెచిన్నెలు మాత్రం ఎవరికి వారు అమర్చుకోవాలి. జోహారు హారాలు మెడలో పడాలంటే ఈ పిదపకాలంలో కొంత పథకగేలం తప్పదు మరి....

పంకజం మొగుడు సుందరం పదిహేను రోజుల కిందట అతని చెల్లెలు పార్వతి నుంచి వచ్చిన ఉత్తరం ఆమె చేతి కిచ్చాడు. మొగుడు పోయాక అత్తారింట్లో తన బతుకు బొత్తిగా అంటగిన్నెలకి అంకితమైపోయిందనీ, ఆ ఆరళ్లు భరించలేకపోతున్నాననీ వెంటనే వచ్చి తీసికెళ్లమనీ ఇంచుమించు ఏడుస్తూ రాసినది అది. పంకజం నెత్తిన పిడుగు పడింది. నిండా పాతికేళ్లు లేవు పార్వతికి. తన పెద్దకొడుకు బాబీకంటే మహాఅయితే అయిదారేళ్లు పెద్ద. ఇంకా తన పిల్లల చదువులూ, పెళ్ళిళ్లూ అన్నీ ముందే ఉన్నాయి. ఈ కరువు రోజుల్లో యిప్పటికే కటకట అయిపోయింది. ఒక విధవరాలిని అదనంగా యింట్లో తెచ్చిపెట్టుకుని యావజ్జీవం పోషించాలంటే మాటలా! 'ఎవరి కర్మ వారిది' అనే సిద్ధాంతం మనది. 'అందరి కర్మా కలి అందరిదీ' అనే వెర్రి వేదాంతం ఎలా నప్పుతుంది యిక్కడ? 'మీ యింట్లో లైటు ఆరిపోయిందని మమ్మల్ని ఆ చీకటి పంచుకోమంటే ఏం న్యాయం?' అని కలవరపడింది పంకజం మనసు. 'ఏమిటి ఆలోచిస్తున్నావ్?' అన్నాడు సుందరం? 'పాపం పార్వతి స్థితి తలచుకుంటే ఒళ్లు నీరైపోతోందండీ.... ఆ ఉత్తరం అందగానే అలాగే ఆఫీసునుంచే ఎక్స్‌ప్రెస్‌బస్ అందుకోక యింటికి వచ్చి నాతో చెప్పి పెర్మిషన్ తీసుకోవాలా!' అని మృదువుగా గోముగా అతని చెయ్యి నిమిరింది. నెంబర్ వన్‌కి వెళ్ళాలన్నా తన పెర్మిషన్ తీసుకుంటారని తెలిసినా, 'ఏడడుగుల' కన్న 'మూడు నిద్దర్లు' బాగా 'పే' చేస్తుందని పంకజం గ్రహించి రెండు దశాబ్దాలుదాటింది మరి. అందుకే అయి ఉంటుంది, వెంటనే వెళ్లి చెల్లెల్ని తీసుకురావాలనే అతని ఆ రాత్రి ఆతృత మర్నాడు తెల్లారేసరికి లేదు. పొద్దున లేస్తూనే 'దాని అత్తారు బొత్తిగా కసాయి వెధవలు. వాళ్లతో నేను నెగ్గుకు వచ్చి దాన్ని తీసుకు రాగలనో లేదో! అయినా మంచికో చెడ్డకో ఒకళ్ల చేతుల్లో పెట్టాక మన పెత్తనం ఏముందీ....పోనీ ఓసారి నువ్వే వెళ్ళి అన్నీ మాట్లాడి వస్తేనో!'

'యముడి పెద్దన్న దమ్ముడిలాంటి మొగుడితో అయితే కష్టంగాని నాధుడు నాన్పుడుగాడు అయితే అంతకన్న గృహలక్ష్మి కోరే వరం ఏముంటుంది!' అని లోలోన సంతోషించినా 'బాగుందండీ మీకు పార్వతి ఆఖరి చెల్లెలు. వాళ్లు అలా రాసి రంపాన పెడుతూ ఉంటే ఏం పట్టనట్టు ఊరుకుంటారా! పాపం చిన్నపిల్ల, ఎంతగా మనసు కష్టపెట్టుకోకపోతే అంతగా రాస్తుంది? రాతిగుండె మొగవాళ్లు. మీలా నే నెలా ఊరుకోగలను. వెంటనే వెళ్ళి నాలుగూ దులిపేసి మరీ తీసుకొచ్చేస్తాము. మన పిల్లే అయితే చంపేస్తుంటే ఊరుకుంటాముటండీ!'


అని అప్పటికప్పుడు, యింకా సుందరం మనసూ గుడ్లూ అప్పగించి చూస్తూ ఉండగానే, పంకజం ప్రయాణం కట్టేసింది.

నిజం చెప్పాలంటే పార్వతి అవస్థ ఆమె తెలియపరచిన దానికంటే అధ్వాన్నంగా ఉంది. 'ఏదో ముప్పొద్దులా చాకిరీ చేస్తున్నా వేళకి ఇంత తిండి పడేస్తున్నారు. అదీ లేనివాళ్ళని ఎందర్ని చూశాం కాదు!' అని లోపల్నుంచి ఉబికి వస్తున్న జాలిని కేకవేసి లోపలికి తోసింది పంకజం. 'ఎంత చిక్కిపోయావే నా తల్లీ' అని పైకి మాత్రం కౌగలించుకుని కన్నీళ్ళు కానుకగా సమర్పించింది. అంతమంది జనం అనుక్షణం కాపలా ఉన్న ఆ సమిష్టి కుటుంబంలో ఆరోజు అర్ధరాత్రి తప్ప వారిద్దరికీ ఏకాంతం కుదరనేలేదు.

'నెలరోజులై ప్రయత్నిస్తున్నాను వదినా ఆ ఉత్తరం రాసి, నా మటుకు నేనే పోస్టుచేద్దామని. ఆయన బతికున్నప్పుడే అంతంతగా ఉండేది ఇంట్లో నా స్థానం. ఇప్పుడు నీ కళ్ళతో నువ్వే చూశావుగా! నిజంగా ఆ ఉత్తరం అన్నయ్యకి అందాలని ఎన్ని దేవుళ్ళకి మొక్కానో! ఇంకో రెండ్రోజులు నువ్వు ఆలశ్యం చేసిఉంటే ఏ నుయ్యో గొయ్యో చూసుకుని ఉందును. నిన్ను చూసి నా పోయిన ప్రాణం లేచివచ్చిందనుకో....ఈ యమ కూపం నుంచి నన్నెలా బయటకి లాగుతావో....'

అని అతి దీనంగా విలపిస్తున్న ఆడపడుచు భుజంమీద మృదువుగా చెయ్యివేసి ధైర్యం చెబుతూ చెబుతూనే నేర్పుగా పక్కదారి పట్టించిందా ఫత్తుజాణ.

'ఇక్కణ్ణుంచి ఇప్పుడే ఇలాగే మనింటికి తీసికెళదామనే నేను వచ్చాను పార్వతమ్మ తల్లీ! కాని ఇండియాలో ఆడదై పుట్టడం కన్న అండమానులో మానై పుట్టడం నయం. ఒకరితో చెప్పుకోలేనంత హైన్యం తల్లీ మన బతుకులు....ఇంతగా వెట్టిచాకిరీ చేయించి నిన్ను పీచాతిపీచంగా చిత్రహింసలకి గురిచేస్తున్నా మీ అత్తింటివారికి ఓ పీతి ఉంది! మావగారూ, బావగార్లూ, మరుదులూ ఎందరు మగజనం మీ యింట్లో! మళ్లీ ఒక్కొక్కరు జమాజట్టీల్లా ఎలా ఉన్నారు! అంతా తాటిచెట్ల పాలెంలో ఉండవలసిన సరుకు! నిన్నో దాసీలా చూడటం నిజంగా తప్పే. కాని పోతరించిన పోతపోసిన పుత్తడి బొమ్మలా ఉన్నావే, నిన్నో దేవదాసీలా చూసు



కుంటే అప్పుడెలా ఉండునంటావ్? వాళ్ళకా కాముక దృష్టి లేకపోవటం ఎంత అదృష్టం అంటావ్? చిన్నపిల్లవి నీకెలా చెప్పనే తల్లీ!'

ఏదో వినకూడనిది వింటున్నట్టు వింతగా పంకజం వైపు చూసింది పార్వతి. ఆ ఆశ్చర్యపు వేడిలో ఆమె బుగ్గమీది కన్నీళ్ళు ఆవిరైపోయాయి. అంతకంటె అత్యాశ్చర్యకరంగా వదిన బుగ్గమీంచి జారుతున్న కన్నీళ్ళు చూసింది.

'అదేమిటి వదినా, నువ్వు ఏడుస్తున్నావా?'

'ఆడపుట్టుక పుట్టేక ఏడవక ఏం చెయ్యమన్నావు? నాకు నా తొలి సంతానం ఆడదే అయితే ఈ సరికి అమ్మమ్మని అయిఉందును. అయినా ఈ క్షణం నా శీలానికి నా స్వంత యింట్లో రక్షణ లేదు!!'

వెయ్యి ఒట్లు వేయించుకుని పంకజం ఆ సంగతి పార్వతికి వివరించింది.

'మీ అన్నయ్య సంగతి ఎరుగుదువు కదా....అరచేతిలో అగ్గెరగరు! అందరూ తనలాంటి అమాయకులే అనుకుంటారు.. పోనీ ఒకరిమాట వింటారా, తను ఎరిగిన మేఘసందేశంలో రామారావే హీరో. వద్దు మహాప్రభో అంటే వినక ఓ రౌడీ వెధవకి మన వీధిగది అద్దెకిచ్చారు. అది వీధిగది కదా, అది దాటి ఇంట్లో ఆడవాళ్ళ బయటికి వెళ్లాలంటావా, పోనీ మనింటి కొచ్చిన ఆడవాళ్ళు లోపలికి రావాలంటావా! పదిహేనూ నలభై అయిదు మధ్య ఏ వయసుదైనా వాడికి చాలు! చూపు తప్పించుకోలేదు వాడి పోకిరీచేష్టలూ రౌడీ వేషాలూ చూసి ఆ వాడవాడ ఆడ జనమంతా ఎప్పుడేం చేసిపోతాడో అని గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకు గడుపుతున్నారనుకో. పనిపిల్ల పని మానేసింది. పెళ్ళాంచేత పాలు పంపించే మనపాలవాడు కుంటివాడైనా పాపం అలాగే, వాడే తెస్తున్నాడు. ఆ మదపిచ్చిగాడి చెయ్యి నా భుజంమీద ఎప్పుడు పడుతుందో అని ఈ వయసులో సహా నాకు కంటికి నిద్ర రావడం లేదు!'

'ఒక్క వెధవ అంటున్నావ్, వీళ్ళ చూస్తే బండెడు బలగం .... వీళ్ళలో ఒక్కరికయినా ఎలాంటి వాళ్ళు కావొచ్చు కాని అలాంటిబుద్ధులు లేవు సుమా! ఇంకా నయం, నేనే ఏ కబురూ లేకుండా వచ్చేద్దామనుకునేదాన్ని, వచ్చేశాను కాను!' అని గుండెని రాసుకుంటున్న పార్వతిని చూసి తృప్తిగా నిట్టూర్చింది పంకజం.

'అదేమిటి ఒక్కత్తివే వచ్చావ్!' అన్నాడు తిరిగొచ్చిన పంకజాన్ని చూసి సుందరం! 'అబ్బ, ఎందుకంత గొంతుక, నేనేం చెప్పినా కిట్టనట్టు ఉంటుంది! మీ మటుకు మీరే వెళ్లి కళ్లతో చూసివస్తే నాకీ చెప్పే దురవస్థ తప్పి ఉండును. ఆ అమ్మాయి రాసింది ఒకటి. అక్కడ జరుగుతున్నది ఒకటి....మరెవరికి చెప్పవని నామీద ఒట్టువేస్తేనే నా నోరు విప్పేది' అంటూ పడకగదిలో పరమ రహస్యం అందించింది

'మొగుడుపోయిన ఈ ఆర్నెల్లకే మీ చెల్లెలు బొత్తిగా చెడిపోయింది. నన్నొకటి కొడితే కొట్టండి, నా చెవుల్తో విన్నదే కాక నా కళ్లతో చూసింది ఇది. వావివరసలు లేవు సరికదా రికైరయిన మావగార్నయినా మీసం సరిగారాని మరిదిగార్నయినా రెచ్చగొట్టే పిచ్చి స్థితిలో ఉంది. ఆ ఆడాళ్లందరూ కలిసి చితక బాది ఆ ఉత్తరం రాయించారుట! పోన్లెండి ఏదో పసిపిల్ల....ఇంటికి తెచ్చి బుద్ధిచెప్పుకుని మళ్లీ పెళ్లిచేసి దార్లో పెట్టడం మన ధర్మం. బతికి లేరుగానీ అత్తగారూ మామగారూ ఉంటే చూస్తూ ఊరుకుని ఉండరు కదా! ఎంత ప్రయత్నించినా నాతో వచ్చింది కాదు. అలాగని ఆగగలదనా ఆడప్రాణి! కలవలకని ఇవాళో రేపో బాబీ దిగుతాడుగా, వాణ్ణి పంపిద్దాంలెండి.

అని తను కావాలని తెచ్చిన కొడుకు ప్రసక్తి భర్తమీద ఎలా పనిచేసిందో రెప్పవాల్చకుండా మొగుడి మొహంలోకి చూస్తూ కూచుంది పంకజం.

పందొమ్మిది నిండాయో లేదోగాని పాతికేళ్ళని చెప్పినా ఎవరూ నమ్మనంతగా ఎదిగిపోయాడు బాబీ. వాడు వెంటపడని ఆడపిల్ల లేదనీ, రెండు వార్నింగులూ మూడు దేహశుద్ధి సన్మానాలూ అప్పుడే అందుకున్నాడని తండ్రికి నమ్మకంగా తెలిసింది. మేనత్తని తీసుకు రమ్మని పంపిస్తే యిద్దరూ యిటు వచ్చేనా, అటు లేచిపోయేనా! పెడుతున్న శ్రాద్ధాలు చాలకనా ఈ కొత్త తద్దినం!

'నే నేదో చూసుకుంటాలే, నీ కన్నిటికీ తొందర' అని అనవసరంగా చికాకు పడుతున్న మొగుణ్ణి చూసి 'అమ్మయ్య' అని సంతృప్తిపడింది పంకజం.

అయినా అక్కడితో ఆపడం పంకజానికి నచ్చని రాజకీయం. ఇరుగూ పొరుగూ నోరు కట్టడంకూడా ఓ అవసరమైన విషయమే. ఏ పొద్దువాలిన వేళో కొళాయి నీళ్ళు పట్టుకోడానికి ఆ యింటికెదురుగా అందరు అమ్మలక్కలూ మూగేవేళ చూసుకుంటుంది. 'ఇదుగో పిన్నిగారూ, మా ఆడపడుచు అత్తగారికి పిల్లని ఓసారి పంపమని ఉత్తరం రాశానండీ....వాళ్ళు బొత్తిగా కిరాతకులు. ఏం రాస్తే ఏం తప్పో....వినిపిస్తాను.... పెద్దలు .... ఎక్కడేం తప్పుందో చెప్పరూ? అన్నట్టు మొన్న మీరు పంచదార అడిగారు కదూ, ఉండండి తెస్తాను' అని లోపలికి పరిగెడుతుంది!